
# మంచి  వాడు

[ కథానిక ]

= శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి =

ఆ రోజు నేను జన్మలో మరిచిపోను. దానికి కారణాలు అనేకం వున్నాయి. రామారావూ, లక్ష్మీకాంతం, నేనూ ముగ్గురం ఒకగదిలో వున్నామన్నమాటే గాని ఎవరికివాళ్లంగానే వుండేవాళ్లం. రామారావు ఎక్కువ మాట్లాడేవాడు గాదు. గట్టిగా మాట్లాడితే సమాధానం చెప్పలేదు. లక్ష్మీకాంతం అతని విషయం తెలుసుకోటానికి విశ్వప్రయత్నం చేసి నిష్ప్రయోజనం అని వదిలేశాడు. లక్ష్మీకాంతానికి అతని విషయం తెలుసుకోవలిసిన అగత్యం కనిపించదు. రామారావులోపల వున్న 'దాన్ని' బైటికి లాగాలని ఎంతో ఆదుర్దాపడేవాడు. నాకు ముందర చెప్పకపోతే నేను నమ్మేవాడినే కాను. లక్ష్మీకాంతానికి రామారావుతత్వం అంత బాగా అర్థంఅయినా అతనికెందుకో అంత అసంతృప్తి నాకు అర్థంకాలేదు.

"మాచావా తమాషా! అతను ఏదన్నా లేకుండా అవస్థన్నా పడతాడుగాని ఇతోళ్లకు 'లేదు' అని చెప్పలేడు-ఆవస్తువతో అతని కెంత అవసరం వున్నా! రేపు పరీక్ష అనుకో— 'షేక్స్‌పియర్ తప్పకుండా కావాలి, చాలా అవసరం' అని అడుగు, వెంటనే ఇస్తాడు! మొన్న ఇడ్డెన్లు తినకుండాచేశానా? ఏమిటంటావు ఇదంతా?"

అసలు నేనూ, లక్ష్మీకాంతం ఇంత దగ్గిరికి వచ్చేవాళ్లం కాదు రామారావు లేకపోయినట్లయితే. షేక్స్‌పియరుమాటేమో నాకు తెలియదుకాని లక్ష్మీకాంతం అతన్ని ఇడ్డెన్లు తినకుండాచెయ్యటం నే నెరుగుదును. లక్ష్మీకాంతం ముందరే చెప్పాడు నాతో చెయ్యబోయ్యేపని. మామూలుగా హోటలుకు వెళ్లాం. లక్ష్మీకాంతం రామారావుని ఇడ్డెన్లు తినకుండా వుప్మాతిని కాఫీ తాగమన్నాడు. కొంచెం మెల్లిగా అనటంవల్ల పక్కనవాళ్లు వూరుకున్నారుకాని లేకపోతే కొంత అలజడి జరిగేదే. రామారావు కించిత్తు అశ్చర్యం కూడా లేకుండా 'దేనికి' అని అడిగాడు. లక్ష్మీకాంతం 'వూరికేనే' అని చెప్పాడు పనివున్నవాడికి మల్లే. మరి ఆపూట రామారావు వుప్మాతోనే తృప్తిపడ్డాడు!

"నావుద్దేశ్యం అతను చాలా మంచివాడని. ఎవ్వరిజోలికీ పోడు చూడు!" అన్నాను. లక్ష్మీకాంతం పెదిమ విరిచాడు కాదన్నట్టుగా.

"నీమంచి దొంగలుదోల! అటువంటివాడు ఈ ప్రపంచంలో బతకటం ఎలాగూ అంటాను!"

"మరేమిటి అయితే?" అని అన్నాను. నాకు కొంచెము కష్టంవేసింది. కారణం నేను అతనిముందర వాట్సన్ అయినానని అనుమానం! నే నేమయినా నాకు అభ్యంతరం లేదుకాని అతను షర్లాక్ హోమ్సు అల్లే కావటం నా కసలు ఇష్టంలేదు. కారణం అతను నాకన్న ఏవిధంగానూ తెలివితేటలుకలవాడు కాడు కాబట్టి. అతని కున్న గొప్పవిశేషం లెక్కల్లో నూటికి నూరుమార్కులు తెప్పించుకోవటం, మేస్టరుచేత

చివాట్లు తినకుండా వుండటం, హోటల్లో వకటో తానీక్కు డబ్బు ఇయ్యటం, భోజనం అయింతరువాత కానీఇచ్చి కిల్లీ తీసుకోవటం. ఈ విషయంలో నాకు అతనిమీద కోపం వుండటానికి ప్రత్యేకంగా కారణం వుంది. నేను నాలుగురూపాయలయింతరువాత కిల్లీల వాడికి ఇయ్యటం మామూలు. వాడెప్పుడూ నాఎదట లక్ష్మీకాంతం అంటివాడు లేడని మెచ్చుకోవటమే! వాడిచ్చే వెధవకానీకి! వుంటే అటువంటిఖాతే వుండాలిట—వెధవఖాతా లేనిదే! లక్ష్మీకాంతం మంచివాడు. కాడని కాను కాని — ఆమాటకొస్తే మంచివాడు అవునని కాదు—రోజు కో కానీ ఇచ్చినందువల్ల అతను మంచివాడు అయిపోవటం అస్మదాదులకు భరించటం దుర్భరం!

నే నంతవరకూ లక్ష్మీకాంతాన్నికాని, రామారావునికాని గమనించలేదు. ఇప్పుడాఅవసరం నాకు కలిగింది. రామారావువిషయంలో లక్ష్మీకాంతానికి ఇంత ఆసక్తి దేనికి అని ప్రశ్న. రామారావు అడిగితే సమాధానం చెప్పేవాడు. అతనంతట అతను ఏవిషయమూ ఎత్తేవాడు కాదు. అతను మాట్లాడితే లోపల వున్నది బైటికి వస్తుందని లక్ష్మీకాంతం గ్రహించి అనేకవిధాల ప్రయత్నించాడు. లాభించలేదు.

ఒకరోజున చిన్నతమాషా జరిగింది. నేను సైగల్‌ను మసిచేస్తుండగా ఎవరో ఎరగని అతను వచ్చి రామారావుకోసమని అడిగాడు. రామారావూ, లక్ష్మీకాంతం ఎక్కడికో వెళ్లారు. ఈమధ్య వారిద్దరికీ మరీ దోస్తిజాస్తిగా వుంది. అందులో రామారావుతప్పేమీ లేదు. లక్ష్మీకాంతం రామారావును అక్కడికీ ఇక్కడికీ రమ్మనేవాడు. రామారావుకు కాదు అనేది లేదాయె. కాఫీహోటలుకూ, సినిమాలకూ కలిసే వెళ్లేవారు. నే నుండగా ఎప్పుడూ తన డబ్బు తనే ఇచ్చుకునేవాడు లక్ష్మీకాంతం. ఇంకా ఎవరైనా ఎరిగినవాళ్లుంటే అట్లాగే చేస్తాడని నా నమ్మకం. ఒకసారిమటుకు కాఫీహోటలుబిల్లు అంతా రామారావు ఇయ్యటమూ, సిగిరెట్లుమటుకు లక్ష్మీకాంతం కొనటమూ జరిగింది. ఏమైనా రామారావును వెంట వేసుకుని తిరుగుతున్నాడు. అలా తిరగటానికి కారణం డబ్బే అయివుండదు. ఆవిషయంలో రామారావు కొంచెం జాగ్రత్తకలవాడిమాదిరిగానే కనపడ్డాడు. ఒకసారి వాళ్లిద్దరూ సినిమాకి బయలుదేరారు. కొంచెంసేపయింతరువాత నాకూ వెళ్లాలనిపించింది. నేను టిక్కెట్లకిటికీదగ్గరికి వెళ్లే సమయానికి లక్ష్మీకాంతం ఇంకోడి నడిగి డబ్బులు తీసుకుని రామారావుకియ్యటం చూడటం తటస్థించింది. ఆమర్నాడు రామారావుతో తిన్నగా లేకపోవటం నాతో కలుపుకోలుతనంగా రామారావువిషయం మాట్లాడటంవల్ల అనుమానం కలిగింది రామారావు కిందటిరాత్రి తనదగ్గిర డబ్బులు లేవని అన్నాడేమోనని. నిజంగా అతనిదగ్గిర లేకపోవచ్చును. రామారావువిషయం తప్ప ఇంకేదీ నాతో మాట్లాడేవాడు కాదు లక్ష్మీకాంతం.

"లేస్తే!" అన్నాను, పాటను ఆపి, వచ్చినాయనతో.

"ఎక్కడికి వెళ్లాడండీ" అన్నాడు అతను నిరాశతో మొహంమీద చెయ్యి పెట్టుకుని.

"ఏమో! దేనికీ?"

"నేనున్న గదిలో ఇదివరకు ఆయన వుండేవాడుట! ఇంటివారితో పోట్లాట లేకుండా ఎలా వుండగలిగాడో తెలుసుకుని ఆవిధంగానే వీలుంటే వుందామని, లేకపోతే వుడాయిద్దామని! రోజూ చస్తున్నాం లెండి! ఇంతకూ మీ రేం చేస్తారు – నా దురదృష్టం!"

"ఎక్కడ మీరుంటున్నది?"

అతను చెప్పి వెళ్లిపోయినాడు.

అయిదునిమిషాలు నానారకాల ఆలోచనలూ వచ్చినై. ఈతమాషా ఏమిటో చూద్దామని గదికి తాళం పెట్టి బయలుదేరాను. సరాసరి వాళ్లింటికి వెళ్లాను. నన్ను చూచి ఆవిడ నెత్తిమీదికి ముసుగు లాక్కుని "ఎవరండీ!" అంది.

"రామారావు ఇక్కడ వున్నాడా?"

"ఏ రామారావు?"

"అతనే—రామారావు!" చెయ్యి కొంచెము పైకి ఎత్తాను ఆవిడకు అర్థం అయ్యేటందుకు.

"అతనా? ఇక్కడ లేడు."

"ఎక్కడున్నాడు?"

"ఎక్కడ్డో గదిలో వుంటున్నాడు. దేనికి?"

"నాదుంప తెంపుతున్నాడండీ. అయిదు రూపాయలు ఇదిగో ఇస్తానని తీసుకున్నాడు. అసలు మనం అడక్కుండానే ఇవ్వటం అతని విధి. మనం అడిగినతరువాతనైనా ఇయ్యనక్కర్లేదా? పోనీ, ఇస్తాడుగదా అని అడక్కపోతే, ఒకాయన బాకీవుండే, మరి నన్ను అడగలేదేం అని అడిగాడు! లోకం ఇలా వుందండి. ఇతను ఎప్పుడన్నా కనపడితే అన్నివిషయాలూ ముచ్చటిస్తాడు. మన క్షేమసంగతి అంతా విచారిస్తాడు. అయిదు రూపాయలసంగతి-ఆవూసే ఎత్తండే! తనేమీ ఇయ్యక్కర్లేదు అన్నట్టుగా మాట్లాడతాడు! ఎన్నాళ్లని వూరుకోటం. ఇస్తాను, ఇవ్వను, ఇప్పుడు లేదు, అప్పుడు ఇస్తాను-వీటిలో ఏదొకటి చెప్పినా బాధ ఉండదే!"

"అతను అలా ఎన్నడూ చెయ్యడే! చాలా మంచివాడు అండీ-మీరేదో పొరపాటుపడివుంటారు!"

"ఏంమంచి—కామంచి! మీ వుద్దేశం మంచి అంటే ఏమిటో చెప్పండీ!"

"పైకి మంచిగా వుండి లోపల గోతులు తీసేవాళ్లుంటారు. వాళ్ల మంచితనం ఎరగనివాళ్లకే వర్తిస్తుంది. ఇంతమందిలో వుండేవాడా-ఎన్నడూ తలఎత్తిచూడగా చూడలేదు! వీళ్లంతా చేరి కొక్కిరాయిళ్లే — ఆడవాళ్లుగదా ఆమాత్రం సిగ్గుపడిచేస్తే ఎలాగండీ—"ఆవిడ గొంతు చిన్నదిచేసింది ఎదురుగా వాకిలివంక చూస్తూ. "పక్కన మొగవాళ్లు ఇంత బజారున పడ్డారేం అనుకోరూ! అమ్మమ్మా! ఇప్పుడొక కవికుమారుడు చేరాడు ఆగదిలోనే. ఏపీ ఈనెల కాగానే బైటికీడుస్తా! నాతండ్రీ, అవి పాటలుగావు, అవి నవ్వులుకావు! రోజూ రాత్రి పదిపన్నెండుమంచి చేరటం, ఒకటే గోల! పోనీ, వచ్చిచ్చి వాళ్ల ఏడుపు వాళ్లు ఏడ్చుకుంటున్నారు కదా అంటే ఆడది బైటికి రావటం భయంకదా. పిచ్చికల్లాసు అంతా చేరతారు! సంసారుల కొంపలు గదా ఏం బాగుంటుంది చెప్పండీ!"

"ఏమిటో! మా రామారావునుటుకు పత్తిత్తు అనుకున్నారా? కాలేజీలో ఆడపిల్లలకు అతనంటే హడలు!"

"నేను చస్తే నమ్మను! మీడబ్బుమాట అన్నారూ, నాకు తెలియని సంగతి-ఈపిల్లలవిషయంమటుకు నేను నమ్మను. వాళ్లే ఇతన్ని ఎకచక్కాలు, వేళాకోళాలు చేస్తుండాలి. ఇతను వట్టి అమాయకుడండి. ముమ్మాటికీ నమ్మండి!"

నాకంటె ఆవిడకు ఎక్కువ తెలుసునా అన్నట్టుగా నవ్వి బయటికి వచ్చేశాను. అదీ సంగతి!

ఒకరోజున లక్ష్మీకాంతం ఆశ్చర్యమొహం వేసుకుని లోపలికి రావటం చూచి, "ఏమిటిసంగతి?" అన్నాను.

"నే నింకా వీ డేదో మంచిమనిషి అని భ్రమించాను!" అన్నాడు అతను.

"ఎవరు?"

"మన రామారావే!"

"ఏం వచ్చింది?"

"లేడీసుహాస్టలుకు వెళ్లాడుట!"

"దేనికి!"

"వాళ్ల పింతల్లికూతుర్ని చూడటానికిట!"

"తప్పేముంది?"

"ఎవరు అతని పింతల్లికూతురు అక్కడ?"

"ఏమో ఎవరన్నా వచ్చివుండకూడదూ ఏపరీక్షకన్నా కట్టి!"

లక్ష్మీకాంతం పెదిమ విరిచాడు కాదన్నట్టుగా. మీ రెన్నన్నా చెప్పండి అతని కున్న దుర్గుణాలలో అది ఒకటి! ఎందుకనో చెప్పకుండా కాదు అనటం దుర్గుణంకాక మరేమిటి? మనం చెప్పింది కాదు అనటానికి అతని కెంత అధికారం వుందో అతని కాదనటాన్ని కాదనటానికి మనకూ అంత అధికారం లేదూ? అంటే పోట్లాటేగా! అందుకనే ఇటువంటి విషయాల్లో రెండోఅడుగు వెయ్యను. లేకపోతే నేనూ, అతనూ ఎప్పుడో పోట్లాడుకునేవాళ్లం.

లక్ష్మీకాంతానికీ, రామారావుకూ స్నేహం ఎక్కువయింది.

కొద్దిరోజులలో ఇంకో విచిత్రమైన సంగతి తెలిసింది. రామారావును ఇలా కాకపట్టేవాళ్లు — ముఖ్యంగా కాలేజీకాంపౌండులో — లక్ష్మీకాంతం కాక ఇంకా వున్నారు. రామారావుదగ్గర కాకపట్ట

తగ్గ ప్రత్యేకత ఏమీ లేదు. నాకు బొత్తిగా అయోమయంగా వుంది. ఇంతకూ ఏదన్నా బైటపడటానికి కాలం రావాలి!

ఒకరోజున తలనొప్పిగా వుండి గంటకొట్టక మునుపే ఇంటికి బైలుదేరాను. నేను పదిగజాలు నడిచి వరండాపక్కకు తిరిగేటప్పటికి రామారావు కొంచెం ముందరగా నడుస్తూ కనిపించాడు. అతన్ని పిలవలేదు. అతను రెండు అడుగులు వేసి మెట్లు దిగబోయి ఆగాడు. అతన్ని నేను కలుసుకునేటంతవరకూ కాస్సేపు ఆకాలుమీదా, కాస్సేపు ఈకాలుమీదా కడుపులో తిప్పుతున్నవాడిమల్లే ఆధారంలేకుండా గాలిలో వేళ్లాడుతున్నాడు. నేను అతన్ని సమీపించగానే రెండుమెట్లకింద వరండాలోవాళ్లకు కనిపించకుండా ఇద్దరు ఆడపిల్లలు నిలబడి అత్యాశ్చర్యంగా అటువేపుకాకుండా, ఇటువేపుకాకుండా, పక్కకూ కాకుండా, ఆగినట్టూకాకుండా, దిగుతున్నట్టూ కాకుండా నిలబడి కిచకిచలాడుతున్నారు. వాళ్లంతట వాళ్లు ఇతన్ని గమనించినప్పటికీ దారి ఇయ్యదలుచుకోలేదని సూక్ష్మబుద్ధి కలవాడినికాబట్టి వెంటనే గ్రహించేసిపారేశాను. ఒక అమ్మాయి కన్నుచివరగుండా రామారావును మొదటినించీ గమనిస్తూనే వుండివుండాలి. నేను అతన్ని కలుసుకోగానే నావంక తిరిగి అర్థంలేకుండా ఒక మెట్టు కిందికి దిగింది. సౌభాగ్యవతి రెండోదానికి నేను రంగంలోకి వచ్చినట్టు తెలియకపోవటంవల్ల వున్న మెట్టుమీదనే వుండి పూర్వంమాదిరిగానే పలుకుతున్నది. దొరికిన ఛాన్సును వృథాపోనియ్యదలుచుకోలేదు.

“అదేమిటోయి, అలా నిలబడ్డావేం?” అని రామారావుచెయ్యి పుచ్చుకుని వాళ్లిద్దరిమధ్యా అతన్ని లాగాను. పదిమెట్లు దిగి పైకి చూచాను. ఇద్దరూ చూస్తున్నారు—కోపంతో కాదు, నిరాశతో!—నావంక కాదు, రామారావువంక! నాతలనొప్పి ఎగిరిపోయింది!

వాళ్లదీ, రామారావుదీ ఒకటే గ్రూపు. నాదీ, లక్ష్మీకాంతానిదీ ఒకగ్రూపు. ప్రాక్టికలు త్వరగా ముగించుకుని – రామారావుకంటె ముందు – అలా అక్కడ వాళ్లు కాపేసివుండాలి. నేను కనక అలా రాకపోతే గంటకొట్టేదాకానో, లేక మరోమొగపడుచు వచ్చేదాకానో అలాగే అతన్ని నిలబెట్టేవారనటానికి సందేహం లేదు. ఇవాళే అలా జరిగింది అనటానికి వీల్లేదు. వీలైనప్పుడల్లా అలాగే జరుగుతుండి వుండాలనటానికి నిదర్శనాలు వున్నై.

పోతే, వెంటబడేవాళ్లని వదిలిపెట్టి దూరంగా పోయేవాడివెంట పడటం ఎందుకో ఈఅమ్మాయిలు. అందమైన ఆడదాన్ని ఆదరించకపోతే ఎవతెకు కోపం రాదు? శూర్పణఖలను నిరాదరిస్తుంటేనే పురాణాలు జరుగుతుంటే అందమైనవారి విషయం చెప్పాలా? రామారావు వాళ్లని గమనిస్తున్నట్టే కనపడడు. అది మరీ అపాయకరమైన సంగతి. అందమైన స్త్రీని ప్రార్థిస్తే కొరెక్కుతుంది, నిరసిస్తే శపిస్తుంది; అశ్రద్ధ చేస్తే? వెంటబడుతుందా? రామారావువిషయంలో అలాగే వుంది. ఈకిటుకు తెలీకేనా లక్ష్మీకాంతం ప్రభృతులు కిటుకేమిటో తెలుసుకోటానికి రామారావు వెంట పడత! అలా అయితే లక్ష్మీకాంతానికి మొదటినించీ తెలిసివుండాలన్నమాట, తనమీదకంటె రామారావుమీదే వాళ్లకు ప్రేమ ఎక్కువని! నాతల తిరిగింది.

పొద్దున్నే లేచి బైటికి రాగానే ఇడ్డెన్లమ్మే వెధవావిడ కనపడ్డది. ఈవాళ ఏదో మూడింది అనుకున్నాను. పైగా అమావాస్య! అయితే దీపావళి ఆ రోజున. సాయంత్రం రామారావూ, లక్ష్మీకాంతం ఎక్కడికో వెళ్లారు, నేను తోటాలు కొని ఇంటికి వచ్చేటప్పటికే. పొద్దుకూకింది; ఇద్దరూ రాలేదు. చేసేది లేక మేడపైకి వెళ్లాను. దూరంగా ఎదురుగావున్న మేడమీద ఎవరో ముత్యాలవత్తి కాలుస్తున్నారు. ముత్యాలు అంతఎత్తునించి కిందికి పడుతుంటే అదేమిటోగా వుంది. ముత్యాలు పడ్డప్పుడల్లా వెనకపక్కగా నిలబడ్డ వ్యక్తియొక్క వదనం, తల్లో దవనం కనిపిస్తున్నాయి. మొహంనిండా ఫేసుపౌడరుకోటింగు వుంది. అరచేతివెడల్పు జరీపట్టుచీరె. మొత్తంమీద నాటుసరుకు అని తేలింది. మతాబాపొగ పక్కన వేపచెట్టును కమ్మేసుకుంది. రోడ్డుమీదికి వంగి చూచాను. చిన్నకుర్రాడు మతాబాని పట్టుకుని దానివంకే చూస్తూ రోడ్డుమీద వెళ్తున్నాడు. ఎదురుగా వాకిట్లో తాటాకు టపాకాయ ముట్టించి ధైర్యంగా చెయ్యి ఎడంగా

పెట్టి మొహం వాకిలివేపు పెట్టి నిలుచున్నాడు ఒక ప్లీడరుగుమాస్తా. పాపం ఏదో జరిగివుండాలి, అది పేలలేదు. రెండునిమిషాలు అలాగే పట్టుకుని దాన్ని చివరకు మొహంవేపు తిప్పుతుండగా పేలింది. ఆచప్పుడుకు అరుగుమీద కుక్క కయ్యోమని పరిగెత్తింది. ఆతని తల్లి వంటపని కోడలికి వప్పచెప్పి వింతచూడ్డానికి బైటికి వచ్చింది. కొడుకు మళ్లీ టపాకాయ ముట్టించి పేలకముందే అవతల పారేశాడు. మనిషి కోమాట న్నారు మరి! మళ్లీ అది పేలలేదు. దాన్ని తీసుకు వద్దామా వద్దా అనుకుంటుండగా పక్కన బుట్టలో బోలెడు కనిపించినై. మళ్లీ ఇంకోటి తీసి వెలిగించి పారేశాడు. రెండోసారి పారేసినదాని రోజులు ఇంకా వున్నయ్యని తేలింది. దారిన పోతూ ఒకాయన దానిమీద అడుగువేశాడు. అది పేలింది. ఎగిరిపడి ఆయన వెధవమొహం వేసుకుని పోయాడు అటూ ఇటూ చూస్తూ, ఎవర్ని తిట్టాలో తెలియక. పక్కఇంట్లో ఒకమ్మాయి —అమ్మాయేం ఫరవాలేదు— వీధివేపు వీపుపెట్టి నిప్పుపుల్లల్ని వెలిగిస్తున్నది. ఇంకా బాగా చీకటి పడకపోవటంవల్ల కొమ్మలంతా గుమ్మాలలోకి రాలేదు. ఒక సాయిబుకుర్రాడు చిన్న జిల్లీ బాగా ముట్టించకముందే అది సర్రున ఎగిరి పక్కవాళ్ల మేడమీదికి పోయింది. వాడు ఆశ్చర్యపోయి ఇంకోటి ముట్టించి గట్టిగా పట్టుకున్నాడు. చేతిలోనే పగిలింది అది. మంట పోయేదాకా చెయ్యి విదల్చి ఇంకోటి ముట్టించి అవతల పారేశాడు. కాస్సేపు పడ్డచోటే మండి గుండ్రగా తిరిగి చివరకు చాదరమ్మముక్తాయింపులా మాట్లాడుకుంటున్న నలుగురి పెద్దమనుష్యుల కాళ్లసందున ఈడింది. వాళ్లలో ఒకడు కోపంగా కుర్రాడివంక చూచాడు. కానీ పెట్టె కొన్నవాటిల్లో నాలుగోది మిగిలింది. అదీ వెలిగించి పైకి ఎగరేశాడు. అది పైనున్న కొమ్మకు తగిలి మళ్లీ వాడినెత్తినే పడింది. దాంతో అల్లాను స్మరిస్తూ పక్కవీధికి వెళ్లాడు. సైకిలుకట్టు కట్టుకుని ఇద్దరు రౌడీలు షికారుకు బయలుదేరి వెళ్లుతున్నారు. చీకటి ఎక్కువయినకొద్దీ వెలుతురు అన్ని మూలల్నించీ ఎక్కువయింది. చిచ్చుబుడ్లు, సీమటపాకాయటప్పాలు, మధ్యమధ్య తోటాలు, మేడలమీదా కిటికీలల్లోనూ వరసగా దీపాలు మహాశోభగా వుంది! లోకకంటకుడు ఒకడు పోయినందుకే ముందుయుగాల జనం ఇంత వుత్సాహం చూపుతుంటే – ఎందుకో తెలీకుండానే అయినప్పటికీ – ప్రపంచానికంతకూ వేరు పురుగులా వున్న దేశం పోతే!

కిందికి వచ్చేశాను మెట్లు దిగి. దొడ్లో మాయింటి ముసలమ్మ తులిశమ్మచుట్టూ దీపాలు పెట్టుకుని ఎదురుగా పట్టుబట్ట కట్టుకుని కళ్లు మూసుకుని జపం చేసుకుంటున్నది. అన్నీ అప్పుడే కాల్చిపారేశాడుకామాలు మనమడు చొక్కా, లాగూ విప్పి పక్కన అరుగుమీద పెట్టి ఆవిడపక్కగా పీటమీద కూచుని ఆవిడవంక కనిపెట్టుకు చూస్తున్నాడు—ఎప్పుడు ఈవిడ జపం చాలించి బెల్లంముక్క పెడుతుందా, ఎప్పుడు లాగూ చొక్కా తొడుక్కుని మళ్లీ వీథిలోకి పరిగెత్తుదామా అని! నేను గదికి వెళ్లాను. తాళం తీసి తలుపు దగ్గిరగా వేసివుంది. లోపలికి వెళ్లి లైటు వెలిగించాను. కాంపుకాటుమీద రామారావు వెల్లికిలా పడుకుని తలకింద చేతులు రెండూ పెట్టుకుని కళ్లు మూసుకుని పడుకున్నాడు. లైటు వెలిగించగానే కళ్లు తెరిచి చూచాడు. ఎవరో తోటా పారేసినట్టున్నారు, మాకిటికీకింద చప్పుడుచేస్తున్నది.

"అదేమిటోయి ఇప్పుడు పడుకున్నావు — బైట సరదాగా వుంటే?" అన్నాను.

"ఆ! పోనిద్దూ!"

"లక్ష్మీకాంతం ఏడీ?"

"పనుందని వెళ్లాడు"

"ఎక్కడికి?"

"ఏమో!"

"నువ్వు ఎక్కడికి వెళ్లావు?"

"షికారు రమ్మన్నాడు, బయలుదేరాం. శివాలయందాకా వెళ్లింతరువాత పనివుంది అన్నాడు! సరేనని నేను ఇంటికి వచ్చాను!"

"అలాగా!" శివాలయందగ్గిర ఒకఅమ్మాయివుంది!

రామారావు లేచి కూచున్నాడు. అతని మొహం అదోరకంగా వుంది.

"సరేలే, లే! తోటాలు తెచ్చాను, కాలుద్దాం రా!"

"తోటాలా?" అతని గొంతు తమాషాగా మారి పోయింది.

"ఆ! ఏం?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ! వద్దు!"

"మీకోసమే కని పెట్టుకున్నాను!"

"అవి పగులుతయ్యి!"

"ఇది బందరుసరుకు!"

"అనే అమ్మతారు వెధవలు! ఖర్మంచాలక పోతే బందరుసరుకైనా పగులుతుంది!"

"తోటాలే అక్కర్లేదు ఖర్మం చాలక పోతే - లే."

"నువ్వు కాల్చు - చూస్తాను!"

"ఎన్నడూ కాల్చలేదా ఏమిటి?"

"కాల్చ కేం?"

"అయితే లే!"

"కాదు - నామాట విను." నేను అతన్ని బల వంతంచేశాను. అతని కెందుకనో తోటాలు కాల్చటం ఇష్టంలేదు. ఏమనుకున్నాడో 'సరే పద' అని బయలు దేరాడు. ఇద్దరం చెరిరెండూ డాబ్బరిగా కాల్చి పారేశాం. నేనుమటుకు వీధివరదాకా వెళ్లివచ్చాను. ఇంకా రెండు మిగిలినై.

"ఒకటి తీసుకో!"

"నువ్వే కాలుద్దా రెండూను!"

"ఫర్వాలేదు కానీయి."

ఇద్దరం ముట్టించాము. అతనటూ, నేనిటూ బయలుదేరాం. నావెనకాల ఢాంఅని చప్పుడయింది. అదరిపడి వెనక్కు తిరిగాను. చీకటి! రామారావు వంటినిండా రవ్వలు! దబదబా అతన్ని సమీపించాను. నాచేతిలో తోటా ఢాం అని పేలింది! వెధవ ఇడ్డెన్ల ముండ!

కేంథారిస్ పట్టించి ఇద్దరం కూచున్నాం.

"నా కెన్నడూ ఇలా జరగలేదు!" అన్నాను నేను.

"నా కిది రెండోసారి!" అతని మొహం అదో రకంగా వుంది. "నాకు ముందరనే తెలుసు ఇలా జరుగు తుందని. అయితే నీతోటాకూడ పగులుతుందని మటుకు అనుకోలేదు!"

"ఎలా తెలుసు ముందరే?" నాకు ఆశ్చర్యం వేసింది.

"కారణం చెప్పలేను — తెలియదు!"

"మొదటిసారి ఎప్పుడు?"

"కొంతకాలంకిందట జరిగింది — మళ్లీ ముట్టుకో లేదు"

ఇద్దరం కలిసి హోటలుకెళ్లి భోంచేశాము.

"అట్లా నాలుగుబజార్లూ తిరిగివద్దాం!"

"ఎందుకు, ఇంటికి వెళదాం!" అన్నాడు రామారావు.

"నలుగురూ పచ్చపచ్చగా బైటికి వస్తారు"

"నేనూ, లక్ష్మీకాంతం చూచివచ్చాంగా!"

కబుర్లు ఆడవాళ్లమీదికి పోయింది. రామారావు అలా ఎన్నడూ మాట్లాడలేదు. నాజీవితంలో అను భవాలు ఒకటి రెండు చెప్పాను. ఎందుకు చెప్పానో నాకు తెలియదు. నిజమే చెప్పాను. అతనుకూడా చెప్పాలని కాదు. కాని అతనూ చెప్పాడు ఆశ్చర్య కరమైన సంగతి ఒకటి.

... ... ...

"కొన్నాళ్లకిందట మాఇంట్లో ఒక ఆఫీసరు అద్దె కుండేవాడు. ఇల్లంతా ఆయనకే అద్దెకిచ్చేశాం. దొడ్లో ఒకమూల చిన్నఇంట్లో రెండు గదు లున్నయి. ఒక దాంట్లో మాసామానూ, రెండోదాంట్లో నేనూ వున్నాం. ఆయనకు ఒక భార్యా, ముగ్గురుపిల్లలూ వున్నారు. నాకూ వాళ్లకూ సంబంధం వుండేది కాదు. కాకపోతే వాళ్ల పిల్లలు ఎప్పుడన్నా నాకిటికీదగ్గిరికి వచ్చి అల్లరి చెయ్యటం, నేను తమాషాగా కసరటం జరుగుతుండేది. మొదట్లో ఆయనకూడా నన్ను పలకరించేవాడు కాదు. అలా ఒక ఏడాది గడిచింది.

"ఆవిడమటుకు చాలా అందమైన మనిషి. ఆవిడా మొదట నాజోలికి వచ్చేదికాదు. కాని అప్పు డప్పుడు పిల్లలు పోరుపెట్టి ఏడుస్తుంటే నావంక చూపించి సాయంత్రం సినిమాకు తీసుకెళ్లుతాడు అనీ ఇలా కథ ప్రారంభించింది. ఆయనా ఎప్పుడన్నా రాత్రిపూట వరండాలో కూచుని నన్ను పిలిచి పరీక్షు చేస్తుండేవాడు క్లాసువిషయాలమీద. నాకు మొదట్లో

అసహ్యంగా వుండేది. కాని ఏం అనలేముకదా! కాని ఆయనధోరణి అర్థమయింతరువాత నాకేమీ కష్టం వేసేదికాదు ఎన్ని ప్రశ్నించినా. ఆవిడకూడా నామీద చాలా చనువు చూపించేది. ఎప్పుడన్నా ఏదన్నా వాళ్లింటో చేసుకుంటే పిల్లలచేత పంపేది ఆకులో పెట్టి. ఒకసారి ఏదో పండగ వస్తే భోజనానికి పిలిచారు. మొదట నేను రానన్నాను. ఆయన ఫరవాలేదు అని బలవంతంచేశాడు. పరాయిఇంటికి ఎప్పుడూ వెళ్లినవాడిని కాకపోవటంవల్ల నాకు చాలా కొత్తగా వుంది. ఇలా రోజులు గడిచినై. తరుచు వాళ్లింటికి వెళ్లటం, ఆవిడతో కబుర్లుమాట్లాడటం జరుగుతూండేది.

"కాని ఆవిడలో నాకు ఒకవిధమైన మార్పు కనిపించింది. అది మొదటినించీ వుందేమో నాకు తెలియదు. వున్నప్పటికీ నేను గ్రహించలేకపోయివుండవచ్చు. నాయెదట ఆవిడ అదోరకంగా నవ్వేది. మొదట్లో ఆ నవ్వు నన్ను అంతగా బాధించలేదు. కాని తర్వాత తర్వాత ఆనవ్వు నాహృదయాన్ని చిదకగొట్టింది. నవ్వుతూంటే మహాఅందంగా వుండేది. అనవ్వు అయినా మామూలుగా వుండేదికాదు; ఎగతాళిగానూ, సవాలుచేస్తున్నట్టుగానూ వుండేది. మాటల్లో నేను నిజం చెప్పుతున్నప్పటికీ అబద్ధం అన్నట్టుగా తేల్చేది ఒకనవ్వుతో, నేను చెప్పేది నిజం అని ఆవిడకు తెలిసినప్పటికీ! అంత అందమయిన మనిషి కాదు అని నవ్వుతూ మనమాట వినిపించుకోకపోతే ఏమిటి చెయ్యటం? నాకూ నవ్వు వచ్చేది. నేను నవ్వగానే "చూచావా? నీకబుర్లు నాదగ్గరనా?" అని విరగబడేది. కాని ఆయన వున్నప్పుడు ఆవిడప్రవర్తన ఇంకోరకంగా వుండేది. ఆభేదం మొదట్లో నేను కనిపెట్టలేదు. కనిపెట్టిననాటినుండీ నాలో విపరీతమైన మార్పు వచ్చింది. నాకు బాధ ఎక్కువయింది. నేను కనిపెట్టటమైనా ఒకవిషయంతో జరిగింది.

"ఒకసారి నేను వాళ్లింటికెళ్లేసమయానికి చిన్నపిల్లవాడు ఏడుస్తున్నాడు పోరుపెట్టి. వాడిని సముదాయించటానికి ఆవిడ నానాతంటాలూ పడుతున్నది. నన్నుచూడగానే నాదగ్గిరికి తీసుకువచ్చి "మాపిల్లవాడిని భయపెట్టుతావా?" అని చెంపమీద మెల్లిగా కొట్టింది నన్ను! "కొట్టాలే, ఇక వూరుకో!" అంది. వాడు ఏడుపు వెంటనే మానేశాడు. ఆవిడ ఒక్కనిమిషం ఏదో చెప్పి పనిచేసుకోటానికి వెళ్లిపోయింది. కాని ఆచిన్నదెబ్బ నాలో విపరీతమైన మార్పు తెచ్చింది. అంతవరకూ ఏ అందమైన పరాయిస్త్రీశరీరమూ నాకు తగలలేదు. స్త్రీశరీరం తగలటంలోకూడా లేదు—వుద్దేశంలో వుంది! ఆవిడచేత మళ్లీ చెంపదెబ్బ తినిపించుకోవా లనిపించింది. ఆవిడ నన్ను ఎందుకు కొట్టినట్టు! ఆ దెబ్బతో వస్తువుల రూపాలూ, రంగులూ మారినై. కొత్తకొత్త అర్థాలు స్ఫురించినై—నిజమో అబద్ధమో తెలియదు! ఆరోజునించీ ఆవిడను ఇంకో దృష్టితో చూచేవాడిని. ఆవిడసమీపంలో వుంటే అదేమిటోగా వుండేది. ఎప్పుడూ ఏదో మిష పెట్టుకొని ఆవిడదగ్గిరికి వెళ్లేవాడిని.

"ఆవిడవుద్దేశం తెలియదు. ఆవిడ కావాలని నన్ను ఆవిధంగా చూచేదో, లేక ఆవిడ అలా చూస్తున్నదని నావయస్సుపొరపాటువల్ల నేను వూహించుకున్నానో నాకు తెలియదు. ఏమయినా నా బాధ ఎలా తప్పుతుంది?

"అనేక చిన్నచిన్న విషయాలలో ఆవిడ నన్ను బాధపెట్టేది. రోజులు గడిచినకొద్దీ నేను బయటపడుతానేమో ననికూడా భయంవేసేది. నాబాధ నా మొహంలో స్పష్టంగా ఆవిడకు కనిపిస్తూవుండాలి. నేనలా బాధపడితే ఆవిడ కెందు కంత ఆనందం? అనేకసార్లు రాత్రిపూట గదిబైటికి వచ్చి వాళ్లింటివంక చూచేవాడిని, వెన్నెలలో చెట్లకింద నీడలో నిలబడి. ఆవిడ ఏం చేస్తున్నదో! ఒక్కసారి బైటికి రాకూడదూ?

"దీపావళిపండగ వచ్చింది. ఆకిందటిరోజే ఆయన ఏదో అవసరమైన పని వుండి వూరికి వెళ్లిపోయినాడు. పండగరోజున ఆవిడ నన్ను భోజనానికి పిలిచింది. నేను మొదట వద్దన్నాను. ఆవిడ వొప్పుకోలేదు. నాకు మరి తప్పలేదు. భోజనాలయింతరవాత అనేకకబుర్లు చెప్పుకున్నాం. రాత్రికికూడ భోజనానికి రమ్మంది.

"ఆరోజుల్లో టోటాలు విపరీతంగా కాల్చేవాడిని. ఆయేడుకూడా కాల్చాను. కాని నాఖర్మంవల్ల పెద్దటోటా చేతిలో పగిలిపోయింది. నా చెయ్యి కాలి బొబ్బలెక్కిపోయింది.

"'ఏమిటది?' అంది ఆవిడ నావంటిమీద బొబ్బలు చూచి.

"'ఏమీ లేదు–తోటా పగిలింది!' నా చెయ్యి మండిపోతున్నది. అమాంతంగా నా చెయ్యి పట్టుకుని చూచి లోపలికి తీసికెళ్లి ఏదో లేపనం పెట్టి కడిగి పైన ఇంతమందు రాచేసింది. ఆవిడ చెయ్యిపట్టుకుని మందు రాస్తుంటే చేతిమంట పోతున్నదిగాని హడావిడిలో చెదరిన ముంగురులచాటుగా కొద్దిగా సిగ్గుతో–ఎలాగైనా పరాయివాడినికదా — నిగనిగా మెరిసే ఆమెమొహం చూస్తే, నాహృదయంలో బాధ ఎక్కువయింది. నాచెయ్యి వదిలిపెట్టటం నా కిష్టం లేదు. తమాషేమిటో చేతిమీద బొబ్బలన్నీ కాస్సేపటిలో అణిగిపోయినై. తర్వాత కాస్సేపుండి ఎట్లాగో భోంచేశాను. ఆవిడ నన్ను అక్కడే పడుకోమంది తోడుగా! నామనస్సు పరిపరివిధాల పోయింది.

"అందరం పడుకున్నాం. నాకు నిద్ర పట్టలేదు. ఎలా పట్టుతుంది? ఆవిడవంక చూచాను. ఆవిడ మామూలుగా పడుకుంది. కాని నిద్రపోతున్నదా లేదా అని అనుమానం. నా కేమీ తోచలేదు. అలాగే పడుకున్నాను. కునుకు పట్టింది. ఆవిడ నా మంచందగ్గిరికి వచ్చి నా వంక చూస్తున్నట్లుగా కలవచ్చింది. అదరిపడి లేచాను. అంతా మామూలుగానే వుంది. లేచి కూచున్నాను. చప్పుడు చెయ్యకుండా ఆవిడమంచందగ్గిరికి వెళ్లాను. రెండు చేతులూ రొంపకింద నాజూకుగా పెట్టుకుని, ముఖం కొంచెం ముందరికి వంచి పడుకునివుంది. నల్లని జుట్టు అందంగా చిక్కులుపడివుంది — పొద్దున్నే తలంటి పోసుకోవటంచేత. దీపంకాంతి ఆమెముఖంమీద ఏటవాలుగా పడుతున్నది. ఆచేతులూ, తలా బూరగదూది దిండులో దిగబడిపోయినై. నీలవర్ణపు చీరెలోనుండానూ, తెల్లని రవికలోనుండానూ దబ్బపండు లాంటి ఆమె శరీరచ్ఛాయ కనిపిస్తూనేవుంది. ముద్దుపెట్టుకోమని చాచినట్టుగావుంది ఆమెముఖం.

"ఆవిడమీద చేయి వేశాను. ఆమె వేడిరక్తం నాచేతికి వెచ్చగా తాకింది. ఆవిడముక్కుల్లోనించి వచ్చే వేడిగాలి నాకు తగిలింది. నాకు నిజంగా మతిపోయింది. ఆవిడను ముద్దుపెట్టుకున్నాను—

"అదిరిపడి లేచి చేతులు విదిలించింది! ఆమె పక్కను నేలమీద కూచుని నే నున్నాన!

"'ఏమిటయ్యా అది!' నాకు భయంవేసింది. నేను మారుమాట్లాడలేదు.

"కోపంతోనూ, భయంతోనూ నన్ను చివాట్లు పెట్టింది. నాకు మైకంపోయింది. చాలా పొరబాటు జరిగిందనీ, ఇక ఎన్నడూ జరగదనీ, క్షమించమనీ ప్రాధేయపడి నాగదికి వచ్చి పడుకున్నాను. మర్నాడు సాయంత్రం నేను ఇంటికి రాగానే ఆయన నన్ను పిలిచి చాలామర్యాదగా చీవాట్లుపెట్టాడు. నేనేమీ మాట్లాడలేదు. ఏదైనా మాట్లాడటం అనవసరం ఆపరిస్థితులలో! అంతే, మరి ఆడది అంటే నాకు చెడ్డభయం! ఈరోజుకుకూడా, నాకు నిజంగా కావలిసిన ఆడది వచ్చినా కన్నెత్తి చూచే ధైర్యం నాకు లేదు! నావల్ల తప్పులేదు అనను కాని ఆవిడ నన్ను అలా చూడటం అన్యాయం. ఆవిడకు ఆ వుద్దేశం లేదని కూడ ఒప్పుకుంటాను. నేనే పొరపాటుపడ్డానని ఒప్పుకుంటాను. ఆవిడ నన్ను చివాట్లుపెట్టినప్పుడు నేను అన్నీ విశదీకరించి ఆవిడకు చెప్పాను. అయినా రుకోక ఆయనతో చెప్పింది. ఎలాగైతేనేం, మా వాళ్లకందరికీ నా చెడ్డతనం తెలిసిపోయింది. ఒకరిద్దరు ఇంటికికూడా రావద్దన్నారు. నన్నెరిగినవాళ్లెవరూ మంచివాడనరు—ఈరోజుకుకూడా!" అతను నవ్వాడు. "నేను చెడిపోకమునుపే నాలో వున్న చెడు చెడిపోయింది!"

"ఎరగనివాళ్లు చెడ్డవాడనీ అనరు—అంటే మంచివాడనితప్ప అనరు!" అన్నాను నేను.

... ... ...

లక్ష్మీకాంతం, నేనూ కాఫీ తాగుతున్నాం.

"మాచావా, రామారావు హాస్టలులో లేడీని పెళ్లిచేసుకున్నాడు!"

"వాళ్ల పింతల్లికూతుర్నేనా?"

"కాదు."

లక్ష్మీకాంతంచేతిలోనించి సాసరు కింద పడి పగలటం, కప్పులోని కాఫీ అప్పుడే కట్టుకున్న బట్టమీద పడటం, నోటిలోని కాఫీ పిచికారీకొట్టినట్టు

ఎదురుగావున్న పెద్దమనిషిమీద పడటం అన్నీ జరిగినై.

"ఎవరిని?"

"శివాలయం!"

లక్ష్మీకాంతానికి ముచ్చెమటలూ పోసినై.

"ఎన్నాళ్లయింది?"

"మొన్ననే!"


"నేను మొదటినించీ అనుమానిస్తూనేవున్నాను, అతను అలాంటి దేమిటో చేస్తాడని. చివరకు అతనా! అంత నంగనాచిలా వుండేవాడు—ఆమె ఎలా లభించింది అంట?"

"వాళ్ల పింతల్లికూతురు ఏర్పాటుచేసిందిట!"

లక్ష్మీకాంతం పెదిమవిరిచాడు, కాదన్నట్టుగా. నాకు వళ్లు మండింది. నాబిల్లుకూడ అతని చేతిలో పెట్టి బైటికి వచ్చేశాను.

---

గనోరియాకు ఆధునిక చికిత్స




నేటి సుప్రసిద్ధ దివ్యౌషధము

ఇంగ్లీషు మరియు యితర నాటువైద్యములకు మీ చర్మవ్యాధి నివారణ కాక పుచ్చుకొన్న యింజెక్షన్లు నిష్ప్రయోజనమై యుండినయడల మేము తయారుచేసిన నేటి "గోనో కిల్లర్"ను వాడిచూడుడు. ఈ సుప్రసిద్ధమందు అన్నివిధముల చర్మబాధలను శీఘ్రకాలములో తొలగించి మీకు సౌఖ్యమునిచ్చును. యిది, **స్త్రీ పురుషులయొక్క,** మూత్రజాడ్యములకును చీముతోగూడిన వివిధ రకముల **గనేరియా-మేహరోగము,** తెలుపుపోవుట, వాపు, వీర్యముపోవుట, పొక్కులు యీ మొదలయినవి దీనివలన నివారణయగును. వేలకొలది జనులు మా మందును వాడి సౌఖ్యము పొందినారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులు యానందించినారు. కాలము పోగొట్టక మీరు యీమందును వకసారి వుపయోగించి యానందము పొందండి. 50 మాత్రల బుడ్డి యొకటికి రూ. 8/-మాత్రమే. వి. పి. పి. ప్రత్యేకము అణాలు 8.

*Sole manufacturer:*—**Dr. D N. JASANI,**
(Dpt. B. H. M) Vithalbhai Patel Road Bombay No. 4.

Madras Agent
APPAH & CO.,
China Bzaara,